www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 24 అక్టోబర్ 2024

సబ్సిడీతో పట్టు, నూలు సరఫరా

ప్రజాశక్తి - కడప : చేనేత కార్మికులకు పట్టు, నూలు కొనుగోలుపై 15 శాతం సబ్సిడీతో ముడి పదార్థాలు సరఫరా చేయనున్నట్లు చేనేత జౌళి శాఖ జిల్లా సహాయ సంచాలకులు బి. పిచ్చేశ్వరరావు తెలిపారు. ఈ అవకాశాన్ని చేనేత కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లాలోని అర్హులైన వ్యక్తిగత నేత కార్మికులు, నేత కార్మికులు సభ్యులుగా ఉన్న ఏజెన్సీలు అనగా స్వయం సహాయక సమూహాలు, జాయింట్ లయబిలిటీ గ్రూపులు, చేనేత సహకార సంఘాలు, హ్యాండ్లూమ్ ప్రొడ్యూసర్ కంపెనీలు, మాస్టర్ వీవర్స్ సబ్సిడీతో కూడిన ముడి సరుకు సరఫరా పథకం లేదా రామెటీరియల్ సప్లై స్కీంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సదరు ప్రతిపాదనలు జిల్లా చేనేత జౌళి శాఖ సహాయసంచాలకులు ద్వారా ఎన్‌హెచ్‌డిసి వారికి పంపబడిన నూలు ఇండెంట్ మాత్రమే 15 శాతం సబ్సిడీతో అమలు చేస్తామన్నారు. పూర్తి వివరాలకు కలెక్టరేట్ లోని డి-బ్లాక్‌లోని జిల్లా చేనేత జౌళి శాఖ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

కార్మికుల శ్రమ దోపిడీని అరికట్టండి

- సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేయాలని సభ్యుల డిమాండ్
- ఇన్‌ఛార్జి మంత్రులు, సిఇఒ గైర్హాజర్

సమావేశంలో మాట్లాడుతున్న జడ్‌పి చైర్‌పర్సన్ శారద

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

కార్మికుల శ్రమ దోపిడీని అరికట్టాలని, జిల్లా ప్రభుత్వరంగ సంస్థల్లో నియమితులైన కార్మికుల వేతనమైన రూ.14 వేలల్లో రూ.ఐదు వేలు దోచుకుంటున్న అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలపై కలెక్టర్ ఆధ్యక్షతన కమిటీ వేసి కాపాడాలని ప్రొద్దుటూరు ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి పునరుద్ఘాటించారు. బుధవారం జిల్లా పరిషత్ చైరపర్సన్ జేష్టాది శారద అధ్యక్షతన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కడప, అన్నమయ్య జిల్లాల ఇన్‌ఛార్జి మంత్రులు, కడప, రాజంపేట ఎంపీలు, రెగ్యులర్ కలెక్టర్, రెగ్యులర్ సిఇఒ గైర్హాజరైన నేపథ్యంలో సమగ్రంగా చర్చిండానికి సమావేశాన్ని వాయిదా వేయాలని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. జడ్‌పి డిప్యూటీ సిఇఒ మైథిలి స్పందిస్తూ పంచాయతీరాజ్ యాక్ట్ ప్రకారం 90 రోజుల్లోపు సమావేశం నిర్వహించాలనే నిబంధన నేపథ్యంలో సమావేశాన్ని నిర్వహిస్తున్నామని, సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2.15 గంటలకు మూడు గంటల వ్యవధిలో ఆరు నుంచి ఎనిమిది విభాగాలను సమీక్షించడానికి పరిమితమైంది. సభ్యులు లేవనెత్తిన ప్రశ్నలకు మొక్కుబడి సమాధానం లభించింది. చింతకొమ్మదిన్నె జడ్‌పిటిసి నరేన్ రామాంజులరెడ్డి అన్నదాత సుఖీభవ, డిఎస్‌సి పరీక్షలు, తల్లికివందనం అమలుపై నిలదీశారు. ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి స్పందిస్తూ అన్నదాత సుఖీభవ, తల్లికివందనం, డిఎస్‌పి పరీక్షలను క్రమపద్ధతిలో నిర్వహిస్తామని తెలిపారు. ఫిబ్రవరి నాటికి డిఎస్‌సి పూర్తి చేసి జూన్‌లో కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరతారని చెప్పారు. తల్లికివందనం అమలులో 12 లక్షల మంది విద్యార్థుల పేర్లలో తేడాలు ఉన్నందు వల్ల వాయిదా వేశామని తెలిపారు. నవంబర్‌లో పూర్తిస్థాయి బడ్జెట్ కేటాయింపుల్లో స్పష్టత వస్తుందన్నారు. అనంతరం శనగ విత్తన సబ్సిడీ కుదించడం దారుణమని, వైసిపి హయాంలో 40 శాతం సబ్సిడీ ఇచ్చిందని చింతకొమ్మదిన్నె జడ్‌పిటిసి నరేన్ విమర్శించారు. శనగ విత్తనం బహిరంగ మార్కెట్లో ధర కంటే ఎక్కువ ధరకు ప్రభుత్వం ఇస్తోందని, ఇందులో సబిసడీ ఎక్కడ ఉందని ప్రశ్నించారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి స్పందిస్తూ రాష్ట్రంలో అధికారం మారినప్పటికీ అధికారులు స్తబ్దుగా ఉన్నారని, మత్తు వదిలించుకుని పని చేయాలని చురుకలు అంటించారు. ఎరువుల ధరలు ఎక్కువగా ఉన్నాయని, ఫిక్స్‌డ్ ధరల జాబితాను దుకాణాల ముంగిట ఉంచాలని సూచించారు. జిల్లా వ్యవసాయశాఖ గ్రామీణ స్థాయికి చేరుకుని శనగల పంపిణీ దగ్గర నుంచి ఎరువుల ధరలు సహా ఇతర పథకా లను అమలు చేయాలని సూచించారు. వ్యవసాయశాఖ డిఎఒ స్పందించి ఆర్‌ఎస్‌కె దగ్గరకు వెళ్లిన తరువాతే యాప్ పని చేస్తోందని, ప్రతి వ్యవసాయశాఖ అధికారి ఫీల్డ్‌కు వెళ న్నారని, మరింత దగ్గరగా పని చేసేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఇటీవలి తుపాన్ ప్రభావానికి 1433 హెక్టార్లలో నష్టం వాటిల్లిందని, ఎన్యూమరేషన్ చేసి నివేదికను పంపిస్తామని తెలిపారు. అనంతరం చక్రాయపేట జడ్‌పిటిసి మాట్లాడుతూ చక్రాయపేట మండలాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి మాట్లాడుతూ రాజంపేటలో జ్వరాల తీవ్రత ఎక్కువగా ఉందని, జ్వర నివారణకు చర్యలు వేగవంతం చేయాలన్నారు. కమలాపురం, పోరుమామిళ్ల సిహెచ్‌సిల్లో గైనకాలజిస్టులను నియమించాలని జడ్‌పిటిసిలు విజ్ఞప్తి చేశారు. జిజిహెచ్‌లో ఎంఆర్‌ఐ స్కాన్ క్వాలిటీని పెంచాల్సిన అవసరం ఉందని చింతకొమ్మదిన్నె జడ్‌పిటిసి చెప్పారు. అనంతరం ప్రొద్దుటూరు ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో కాన్పుల సంఖ్యను పెంచినప్పుడే పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. అనంతరం చక్రాయపేట జడ్‌పిటిసి స్పందించి చక్రాయపేటలో అధిక పాలదిగుబడి లభిస్తోందని, దాణా ధరల కారణంగా ప్రతినెలా రూ.60 లక్షలు నష్టపోతున్నారని తెలిపారు. చింతకొమ్మదిన్నె జడ్‌పిటిసి ఉచిత గ్యాస్ సిలిండర్ల అమలు హామీ ఎప్పుడని, ఇందులో గ్యాస్ సిలిండర్, పొయ్యి కూడా ఇస్తారా లేక సిలిండర్‌కే పరిమితమా చెప్పాలన్నారు. ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి స్పందించి దీపావళికి గైడ్‌లైన్స్ వస్తాయని చెప్పారు. ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ జమ్మలమడుగు పరిధిలో దాల్మియా పరిశ్రమ యాజమాన్య నిర్లక్ష్యం కారణంగా వర్షాకాలంలో అలుగువాగు ఏరియా ఆక్రమణల కారణంగా దాల్మియా కాంపౌండ్ లోపలి భాగంతోపాటు, రెండు, మూడు దళిత గ్రామాలు ముంపు బారిన పడుతున్నాయని విమర్శించారు. దీనిపై అప్పటి కలెక్టర్లు రెవెన్యూ అధికారుల తప్పుడు నివేదిక కారణంగా ముంపునకు గురవుతున్నారని, పరిశ్రమకు ఇబ్బంది తలెత్తకుండా, దుగ్గనపల్లి, నవాబ్ పేట, చిన్నకొమ్మెర్ల గ్రామాలకు నష్టం వాటిల్లకుండా చూడాలన్నారు. అనంతరం అన్నమయ్య రిజర్వాయర్ పునర్ధరించాలని కోరుతూ ఏకగ్రీవ తీర్మానాన్ని ఆమోదించారు. సమావేశంలో ఎంపీ మేడా రఘునాథరెడ్డి, కమలాపురం ఎమ్మెల్యే కృష్ణ చైతన్యరెడ్డి, అన్నమయ్య డిఆర్‌డిఎ పీడీ సత్యనారాయణ, డిప్యూటీ సిఇఒ మైథిలి, జడ్‌పిటిసిలు, ఎంపిపిలు, జిల్లాలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో మహిళలకు రక్షణ లేదు

- నేను వస్తున్నాననే తక్షణ సాయం
- బాధిత కుటుంబం పరామర్శలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి

ప్రజాశక్తి-బద్వేలు

కూటమి పాలనలో మహిళలకు రక్షణ లేదని, ప్రజలకు భరోసా లేదంటూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. బద్వేలులో యువకుడి దుర్మార్గానికి బలైన విద్యార్థి కుటుంబాన్ని బుధవారం జగన్ పరామర్శించారు. వారిని ఓదార్చి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఘటన జరిగినప్పుడే ప్రభుత్వం భరోసా ఇవ్వాలన్నారు. ఒక ఉన్మాది చేతిలో చదువుల తల్లి దస్తగిరమ్మ అతి కిరాతకంగా హత్య కాబడితే ఐదు రోజులకు గాని సాయం చేయడానికి మెలకువ రాలేదని, ఈ మొద్దుబారిన ప్రభుత్వానికి మనసు రాలేదన్నారు. బాలిక కుటుంబాన్ని పరామర్శించేందుకు జగన్ వస్తున్నాడని తెలిసి బుధవారం ఉదయం ఆగమేఘాల మీద బాలిక కుటుంబంతో ఫోన్లో మాట్లాడి సాయం చేశామని చెప్పుకోవడానికి జిల్లా కలెక్టర్‌తో తక్షణ సాయాన్ని అందజేశారే కాని, నిజంగా చంద్రబాబు ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ముందే ఎందుకు సాయం చేయలేదని సూటిగా ప్రశ్నించారు. కష్టాల్లో ఉండే కుటుంబాన్ని వారి ఇంటికి వచ్చి ఓదార్చినప్పుడే ఆ కుటుంబ సభ్యులకు కొండంత అండ అని, ఆ అలవాటు ఒక వైసిపికే సాధ్యమని, నా తండ్రి వైఎస్ఆర్ చనిపోయినప్పుడు ఆయన అభిమానించే అభిమానులు ఆ విషయం తెలుసుకుని భరించలేక గుండె పగిలి చనిపోతే ప్రతి ఒక్క ఇంటికి వెళ్లి ఓదార్చనే గాని, ఏ ఒక్కరిని ఫోన్లో మాట్లాడి ఓదార్చలేదని పేర్కొన్నారు. అధికార జాతీయ పార్టీని సైతం లెక్కచేయలేదని, వారి కేసులకు భయపడలేదని, ప్రజల మనసు గెలుచుకోవాలనే ఆశ ఒకటే ఉండేదన్నారు. రాక్షస పాలనను మానుకుని ప్రజల మనసును గెలుపొందేలా వారి పాలన ఉండాలని కోరుకుంటున్నానని తెలిపారు. నిందితునికిప్రత్యేక కోర్టు ద్వారా కఠిన శిక్ష విధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, అప్పుడే ఇలాంటి ఉన్మాదులకు భయం కలుగుతుందని పేర్కొన్నారు. చంద్రబాబు పాలన ఇలాగే కొనసాగితే ప్రజలు తిరగబడతారన్నారు. కార్యక్రమంలో కడప ఎంపీ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ గోవిందరెడ్డి, బద్వేల్ ఎమ్మెల్యే దాసరి సుధ, రాజంపేట ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి, కడప నగర మేయర్ కె.సురేష్ బాబు, మాజీ ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజద్‌బాష, మైదుకూరు మాజీ ఎమ్మెల్యే రఘురామిరెడ్డి, ఎమ్మెల్సీలు రామచంద్రారెడ్డి, రమేష్ యాదవ్ పాల్గొన్నారు.

విద్యార్థిని కుటుంబానికి రూ.10 లక్షల చెక్కు అందజేత

- బాధిత కుటుంబంతో ఫోన్లో మాట్లాడిన సిఎం చంద్రబాబు

బాధిత కుటుంబానికి చెక్కును అందజేస్తున్న ఇన్‌ఛార్జి కలెక్టర్ అతిది సింగ్

ప్రజాశక్తి-బద్వేలు

వైఎస్ఆర్ జిల్లా బద్వేలులో పెట్రోల్ దాడికి గురై మృతి చెందిన ఇంటర్ విద్యార్థిని కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలిచింది. ఆమె కుటుంబానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రూ.10 లక్షల ఆర్థిక సాయం ప్రకటించారు. బుధవారం బాధిత కుటుంబ సభ్యులతో ముఖ్యమంత్రి ఫోన్‌లో మాట్లాడి పరామర్శించారు. పెట్రోల్ దాడికి గురై మృతి చెందిన విద్యార్థిని తల్లితో సిఎం చంద్రబాబు ఫోన్‌లో మాట్లాడారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటానని ధైర్యం చెప్పారు. నిందితుడిని అరెస్టు చేశారని, కఠిన శిక్ష పడేలా చేస్తామని హామీ ఇచ్చారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరుపుతామని చెప్పారు. బాలిక సోదరుడికి చదువు బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ఆమె తల్లికి ఉపాధి కల్పించేలా ఏర్పాట్లు చేయాలని సిఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అనంతరం ఇన్‌ఛార్జి కలెక్టర్ అదితి సింగ్, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసులరెడ్డి చక్కును అందజేశారు. కార్యక్రమంలో ఆర్‌డిఒ చంద్రమోహన్, తహశీల్దార్, మున్సిపల్ కమిషనర్, టిడిపి బద్వేలు నియోజకవర్గ సమన్వయకర్త రితేష్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

లోయలో పడిన ఆర్‌టిసి బస్సు

- 25 మందికి గాయాలు
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన ఆర్ఎం, ఆర్‌డిఒ
- క్షతగాత్రులను పరామర్శించిన ఎమ్మెల్సీ, అధికారులు

30 అడుగుల లోయలో పడిన ఆర్‌టిసి పల్లెవెలుగు బస్సు

ప్రజాశక్తి-పులివెందుల రూరల్

వైఎస్ఆర్ జిల్లా పులివెందుల సమీపంలో బుధవారం రోడ్డు ప్రమాదం జరిగింది. ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించబోయి ఆర్‌టిసి పల్లెవెలుగు బసు 30 అడుగుల లోయలో పడింది. కదిరి నుంచి పులివెందులకు వస్తుండగా ఈ ఘటన చోటుచేసుకుంది. ప్రమాదంలో 25 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను పులివెందుల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. కదిరి నుంచి బయల్దేరిన బస్సు పులివెందుల సమీపంలోని డంపింగ్ యార్డు వద్దకు రాగానే ఎదురుగా వస్తున్న వాహనాలను తప్పించే క్రమంలో డ్రైవర్ బ్రేకులు వేశారు. బస్సు స్కిడ్ అయి చెట్లను తాకుతూ పక్కనే ఉన్న లోయలో పడిపోయింది. విషం తెలుసుకున్న ఆర్‌టిసి, డిఎస్‌పి మురళి నాయక్, సిఐ జీవన్ గంగానాథ్ సంఘటనా స్థలానికి చేరుకున్నారు. స్థానికుల సాయంతో క్షతగాత్రులను వెంటనే 108 వాహనం ద్వారా పులివెందుల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రయాణికులు కొంతమందికి చేతులు విరిగి, మరి కొంతమందికి నడుములు, మరి కొంతమందికి గాయాలయ్యాయి. కండక్టర్ నీరుదామణికి నడుముకు సంబంధించి ఎక్కువగా నొప్పి ఉండడంతో ఆమెకు చికిత్స చేశారు. కదిరికి చెందిన షేక్ షావూర్ జశాకు ఎడమ చేయి విరిగింది. ముదిగుబ్బ మండలానికి చెందిన వెంకట శివమ్మకు భుజం విరిగింది, మరి కొంతమందికి గాయాలయ్యాయి. ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను టిడిపి ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, కౌన్సిలర్ కిషోర్ పరామర్శించారు. బాధితులకు మెరుగైఏన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు. బస్సు లోయలో పడిన ప్రాంతాన్ని కూడా పరిశీలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా డ్రైవర్ గంగిరెడ్డి పోలీసుస్టేషన్‌లో లొంగిపోయారు.

గాయపడిన కండక్టర్

మెరుగైన వైద్యం అందించండి : ఆర్‌డిఒ

బస్సు బోల్తా ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను పులివెందుల ఆర్‌డిఒ అన్నపూర్ణ ప్రత్యూష భానుశ్రీ, తహశీల్దార్ నజీర్ అహ్మద్, ఆర్‌టిసి రీజనల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి, ఇన్‌ఛార్జి డిపో మేనేజర్ ప్రవీణ్ పరామర్శించారు. ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మల్లీశ్వరిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.

ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

జగన్ వ్యాఖ్యలు సరికాదు : ఎమ్మెల్సీ

ప్రజాశక్తి-కడప అర్బన్

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి బద్వేల్ నియోజకవర్గంలో హత్యకు గురైన బాలిక కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చి రాష్ట్రంలో శాంతిభద్రతలు లేవని, ప్రజలకు లక్షణ లేకుండా పోయిందని మాట్లాడడం సరికాదని ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం జడ్పీ కార్యాలయ ప్రత్యేక హాలులో విలేకరులతో మాట్లాడుతూ జగన్ సిఎంగా ఉన్నప్పుడు సొంత నియోజకవర్గంలో లింగాల మండలం పెద్దగూడల అనే గ్రామంలో ఒక దళిత మహిళ నాగమ్మను బాలురు అత్యాచారం చేసి హత్య చేస్తే కేసు కట్టకుండా నీరుగాల్సిన చరిత్ర జగన్‌దన్నారు. కరోనా సమయంలో దళిత డాక్టర్ సుధాకర్‌ను ఏ విధంగా హింసించారో అందరికీ తెలుసన్నారు. రాష్ట్రంలో రెండు లక్షల మంది మహిళలు కనపడకుండా పోయారని కేంద్ర ప్రభుత్వానికి చెందిన ఎన్‌సిఆర్ సంస్థ చెప్పిందని తెలిపారు. కాకినాడలో దుర్గాప్రసాద్, నెల్లూరులో హరిప్రసాద్ అనే దళితులు హత్యకు గురయ్యారని పేర్కొన్నారు. బద్వేలులో బాలిక మరణానికి కారణమైన విగ్నేష్‌ను సంఘటన జరిగిన కొన్ని గంటల్లోనే పోలీసులు పట్టుకున్నారని తెలిపారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం రూ.10 లక్షలు ఆర్థిక సహాయం చేసిందని చెప్పారు. కుటుంబానికి అండగా ఉంటామని సిఎం చంద్రబాబు హామీ ఇచ్చారని పేర్కొన్నారు. వివేకా హత్యను, ఆత్మహత్యనా, మరో సంఘటన మీకు తెలియదా అని పేర్కొన్నారు. గంజాయి సంస్కృతిని రాష్ట్రంలో, రాయలసీమలో పరిచయం చేసిన వ్యక్తి జగన్ అని విమర్శించారు. రాష్ట్రంలో డైనమిక్ హోం మంత్రి అనిత ఉన్నారని తెలిపారు. తప్పు చేస్తే ఎవరైనా జైలుకు వెళ్లాల్సిందేనని పేర్కొన్నారు.

హైకోర్టులో ఎంపీ అవినాష్‌రెడ్డికి నిరాశ

ప్రజాశక్తి-కడప ప్రతినిధి : కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డికి తెలంగాణ హైకోర్టులో షాక్ తగిలింది. వైఎస్.వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడిగా ఉన్న అవినాష్‌రెడ్డి, ఆయన తండ్రి భాస్కర్‌రెడ్డి ముందస్తు బెయిల్ కండిషన్లను సడలించాలని కోరుతూ తెలంగాణ హైకోర్టును ఆశ్ర యించిన సంగతి తెలిసిందే. ముందస్తు బెయిల్ మంజూరు చేసిన ప్పుడు వారిద్దరూ దేశం విడిచి వెళ్లరాదని కోర్టు షరతు విధించింది. విదేశీ పర్యటనలకు అనుమితి కావాలంటే సిబిఐ కోర్టులో పిటిషన్ వేసుకోవాలని హైకోర్టు తెలిపింది.

మురళీ లేడీస్ కార్నర్ ప్రారంభం

ప్రజాశక్తి-కడప అర్బన్ : నగరంలోని ఎర్రముక్కపల్లెలో బుధవారం మురళీ లేడీస్ ఫ్యాన్సీ, గిఫ్ట్ కార్నర్‌ను తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం నగర అధ్యక్షులు కళ్యా సుధాకర్, 21వ డివిజన్ వైసిపి నాయకులు మోతుకూరి సుబ్బరాయుడు, షాపు యాజమాన్యం మురళీ, సతీమణి భార్గవి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ అందరికీ అందుబాటులో ఉండేలా ఫ్యాన్సీ, గిఫ్ట్ కార్నర్ ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. యాజమాన్యం మురళీ మాట్లాడుతూ మహిళలకు సంబంధించిన అన్ని రకాల ఫ్యాన్సీ, గిఫ్ట్ ఐటమ్స్ సరసమైన ధరలకే అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో తొగటవీర క్షత్రియ సంక్షేమ సంఘం నగర ప్రధాన కార్యదర్శి పల్లా నరసింహారావు, కోశాధికారి టేకూరి సుదర్శన్, గౌరవ అధక్షులు సుంకర రామచంద్రుడు, కార్యవర్గ సభ్యులు కాల్వ గంగాధర్, వాగేష్, ప్రభావతి పాల్గొన్నారు.

వ్యాసరచన పోటీల్లో విద్యార్థులకు బహుమతులు

ప్రజాశక్తి-చింతకొమ్మదిన్నె : విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా మండలం పెద్దకాంపల్లిలోని పవర్ గ్రిడ్ సంస్థ వారు జె.కొత్తపల్లె హైస్కూల్, బోడెద్దుల పల్లి ఉర్దూ హైస్కూల్‌లలో విద్యార్థులకు బుధవారం వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. పవర్ గ్రిడ్ డిప్యూటీ జనరల్ మేనేజర్ ఎ.హరి వెంకట కుమార్ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని, భవిష్యత్ సమాజం ఉత్తమంగా రూపొందాలంటే విద్యార్థులు బాగా చదివి అభివృద్ధిలోకి రావాలని ఆకాక్షించారు. విభిన్న సంస్కృతుల, జాతుల సమూహమే సమాజమన్నారు. సమాజ రూపకల్పనలో విద్యాలయాల పాత్ర ప్రముఖమన్నారు, సమావేశంలో పవర్ గ్రిడ్ అధికారులు ప్రమోద్, రమేష్, జె.కొత్తపల్లి, బోడెద్దులపల్లి ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న డిసిసి అధ్యక్షులు విజయజ్యోతి

నిందితుడిని కఠినంగా శిక్షించండి : డిసిసి

ప్రజాశక్తి-కడప : రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదని డిసిసి అధ్యక్షులు ఎన్.డి. విజయజ్యోతి అన్నారు. బద్వేల్‌లో విద్యార్థి సంఘటనలో హంతకుడిని ఉరితీయాలని డిమాండ్ చేశారు. బుధవారం డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందన్నారు. సమాజంలో మహిళలపై దాడులు జరగకుండా తగ్గించే దిశగా ప్రభుత్వాలు పనిచేయాలన్నారు. హత్యలను రాజకీయం చేయకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. సెల్ ఫోన్లు, సోషల్ మీడియాను ప్రభుత్వం కట్టడి చేయాలన్నారు. సమావేశంలో పిసిసి మాజీ కార్యదర్శి సిరాజుద్దీన్, పిసిసి మహిళా మాజీ ఉపాధ్యక్షులు శ్యామలమ్మ, డిసిసి మాజీ ఉపాధ్యక్షులు కదిరి ప్రసాద్ గౌడ్, ప్రముఖ సంఘ సేవకులు సయ్యద్ సలావుద్దీన్, ఎస్సీ విభాగం మాజీ జిల్లా అధ్యక్షులు వెంకటరమణ, కడప మాజీ పార్లమెంట్ ఇన్‌ఛార్జి సయ్యద్ గౌస్ పీర్, అప్పపోగుల ఎల్లయ్య, సంజయ్ కాంత పాల్గొన్నారు. **పలువురు కాంగ్రెస్‌లో చేరిక :** విజయజ్యోతి సమక్షంలో ప్రొద్దుటూరు నియోజకవర్గం నుంచి న్యాయవాది అబ్బాస్, సి.ఎస్.పీరా, షేక్ నాయబ్ రసూల్, షేక్ నూరుల్లా, షేక్ మస్తాన్ పార్టీలో చేరారు. జిల్లాలోనూ ప్రొద్దుటూరులోనూ పార్టీని మరింతగా బలోపేతం చేసేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో షేక్ ఇర్ఫాన్, గోసంగి సుబ్బారెడ్డి, జయ కుమార్ పాల్గొన్నారు.

పాపాగ్ని నది నుంచి పెద్దచెరువుకు నీటి మళ్లింపు

ప్రజాశక్తి-కమలాపురం టౌన్ : ఎమ్మెల్యే కృష్ణచైతన్యరెడ్డి ఆదేశాల మేరకు నియోజకవర్గ రైతు సంఘం అధ్యక్షులు చాపాటి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో కమలాపురం పెద్దచెరువుకు నీటిని మళ్ళించే కార్యక్రమం బుధవారం చేపట్టారు. సర్వరాయ సాగర్ నుంచి జిఎన్‌ఎస్‌ఎస్ కాలువ ద్వారా పాపాగ్ని నదికి విడుదల చేసి గాడిదల వంక ద్వారా చెరువులో నీరు నింపుతామని ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. 25 వేల మంది జనాభా కలిగిన కమలాపురం పట్టణానికి తాగునీరు, చుట్టు చుట్టుపక్కల గ్రామాల ఆయకట్టు రైతులకు సాగునీరు అందుతుందన్నారు. ఐదేళ్లలో పుత్తా నరసింహారెడ్డి ఆదేశాలతో కమలాపురం చెరువుకు, చదిపిరాల చెరువుకు కూడా నీరు నింపామని తెలిపారు.

పరిశోధనలపై దృష్టి సారించాలి

ప్రజాశక్తి - కడప : విద్యతో పాటు పరిశోధనలపై విద్యార్థులు దృష్టి సారించాలని ఆర్ట్స్ కళా శాల డాక్టర్ జి.రవీంద్రనాథ్ అన్నారు. ప్రభుత్వ పురుషుల కళాశాలలో మొదటి సంవత్సరం జంతు శాస్త్రం హనర్స్ చదువుతున్న కె.సాయి లీలా మని నిహాంత్ ప్రజెంటేషన్ విభాగంలో మొదటి బహుమతి అందుకోవటం పట్ల సన్మాన కార్యక్ర మం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విధార్థులు చదువుతో పాటు పరిశోదనల వైపు దృష్టి సారించాలన్నారు. డాక్టర్ వై.సావిత్రి పర్యవేక్షణలో పత్ర సమర్పణ చేశారు. డిగ్రీ, పీజీ విద్యార్థుల విభాగంలో అవార్డు తీసుకోవటం పట్ల జంతు శాస్త్ర విభాగధిపతి డాక్టర్ పి.రవి శేఖర్, డాక్టర్ నాగేంద్ర, మహేష్, అపర్ణ సంతోషాన్ని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.రమేష్, అకాడమిక్ కో-ఆర్డినేటర్ డాక్టర్ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

నవంబర్ 11 లోపు పరీక్ష ఫీజు చెల్లించాలి

ప్రజాశక్తి-కడప అర్బన్ : ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలకు నిర్దేశిత ఫీజులను నవంబర్ 11 వరకు ఎలాంటి అపరాధ రుసుం లేకుండా చెల్లించవచ్చని ఆర్ఐఒ వెంకటసుబ్బయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అపరాధ రుసుం రూ.వెయ్యితో నవంబర్ 12 నుంచి 20 వరకు చెల్లించవచ్చని పేర్కొన్నారు. ఆ తరువాత ఎలాంటి పొడిగింపు ఉండదని తెలిపారు. మొదటి లేదా రెండో ఏడాది జనరల్ థియరీ సబ్జెక్టులకు రూ.600, ద్వితీయ సంవత్సరం ప్రాక్టికల్స్‌కు రూ.275, ప్రథమ లేదా ద్వితీయ సంవత్సరం బ్రిడ్జ్ కోర్స్ సబ్జెక్టులకు రూ.165 చెల్లించాలని పేర్కొన్నారు. ప్రథమ, ద్వితీయ సంవత్సరాల జనరల్ పరీక్షలకు రూ.1200 చెల్లించాలని తెలిపారు. హాజరు మినహాయింపుతో ప్రవేట్ అభ్యర్థులుగా పరీక్షలు రాసేందుకు నవంబర్ 15 లోపు రూ.1500 ఫీజు చెల్లించాలని పేర్కొన్నారు. ఈ నిర్దేశిత ఫీజులు కాకుండా అధికంగా ఫీజులు వసూలు చేసే జూనియర్ కాలేజీలపై బోర్డు నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రాక్టికల్స్ పేరుతో అధికంగా ఫీజులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు అందితే జూనియర్ కళాశాల గుర్తింపు రద్దుకు సిఫారసు చేస్తామని పేర్కొన్నారు.

ఎంత మందిని కాపాడారో జగన్ చెప్పాలి

- టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్

ప్రజాశక్తి-కడప అర్బన్

ఉన్మాది చేతిలో బలైన విద్యార్థిని దస్తగిరమ్మ తల్లిదండ్రులకు రూ.10 లక్షలు ఆర్థిక సహాయం ప్రభుత్వం తరుపున ముఖ్యమంత్రి అందించారని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్సూర్ అక్బర్ అన్నారు. బుధవారం పాత బస్టాండ్‌లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు బాధితులకు అండగా ఉంటూనే వారికి న్యాయం జరిగేదానికి ప్రత్యేక శ్రద్ధతో నిందితుడికి త్వరగా శిక్ష పడేలా చేసేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టు ద్వారా విచారణ జరిపి అత్యంత కఠిన శిక్ష పడేలా చేస్తామని బాధిత కుటుంబానికి హామీ ఇచ్చారన్నారు. జగన్ మోహన్‌రెడ్డి పరిపాలనలో 2 వేల మంది పైన మహిళలపై ఆగాయిత్యాలు జరిగితే ఎంతమందికి న్యాయం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. 11 మంది మైనారిటీలపై అత్యంత ఘోరంగా కొంత మంది సైకోల మూలంగా హత్యలు జరిగితే మీ ప్రభుత్వం ఆర్థిక సహాయం చేశారా? అని ప్రశ్నించారు. సమావేశంలో మైనారిటీ నాయకులు రూపన గుడి హుస్సేన్, బాబయ్య, అమీర్ ఖాదర్ బాషా, సీమన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మన్నూరు అక్బర్

ఆయుధాల వినియోగంపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి-సిద్ధవటం

పోలీస్ అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా బుధవారం భాకరాపేట 11వ బెటాలియన్ ఇన్‌ఛార్జి కమాండెంట్ డి.నాగేశ్వరప్ప ఆదేశాల మేరకు బెటాలియన్‌లో ఓపెన్ హౌస్ కార్యక్రమాన్ని నిర్వహించి ఆయుధాలు సాంకేతిక పరికారికరాలను ప్రదర్శించారు ఆయుధాల సాంకేతిక పనితీరుపై విద్యార్థి విద్యార్థులకు అవగాహనా కల్పించారు. కార్యక్రమంలో 11వ బెటాలియన్ పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో 260 మంది పాఠశాల విద్యార్థులందరూ ఆసక్తిగా పాల్గొని పోలీస్ ఆయుధాల పనితీరుపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్స్ ఎం.థియోఫిలాస, ఆర్.విల్సన్, కేర్ యూనిట్ మెడికల్ ఆఫీసర్ దివ్య రాణి, ఎఆర్‌ఎస్‌ఐలు ఆర్‌ఎస్‌ఐలు, ఆర్‌ఐలు, బెటాలియన్ సిబ్బంది, పాఠశాల హెడ్ మాస్టర్ ఎస్.నాగ మునిరెడ్డి పాల్గొన్నారు.

ఆల్ ఇండియా వైస్ చైర్మన్‌గా సైపుల్లా

ప్రజాశక్తి-కడప అర్బన్

ప్రతిభ, నిబద్ధతకు గుర్తింపుగా ఖలీద్ సైఫుల్లాను ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ డేటా అండ్ టెక్నాలజీ విభాగం ఆల్ ఇండియా వైస్ చైర్మన్‌గా ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే నియమించారు. ఖలీద్ సైఫుల్లా కడపలోని మదీన ఇంజినీరింగ్ కాలేజీలో చదువుకున్నారు. సాఫ్ట్‌వేర్ నిపుణుడు, గూగుల్, ఇన్ఫోస్యో, నెస్, డెల్ వంటి ప్రముఖ సంస్థల్లో పనిచేసిన 20 ఏళ్ల కంటే ఎక్కువ ఐటీ పరిశ్రమ అనుభవాన్ని కలిగి ఉన్నారు. డేటా అనలిటిక్స్, టెక్నాలజీ రంగాల్లో ఆయన నైపుణ్యాలను విశ్వమంతా గుర్తించింది. కాంగ్రెస్‌లో చేరే ముందు ఖలీద్ సైపుల్లా 'మిస్సింగ్ ఓటర్స్ యాప్', 'ఫ్రీ రేషన్ యాప్', 'ఫ్రీ ఆక్సిజన్ యాప్' వంటి అప్లికేషన్ల ద్వారా సామాజిక, సంక్షేమంలో చేసిన కృషికి పెద్ద ప్రచారం పొందారు.

విద్యార్థులతో మాట్లాడుతున్న డిప్యూటీ డిఇఒ కృష్ణప్ప

శ్రద్ధతో విద్యనభ్యసించాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

శ్రద్ధతో విద్యనభ్యసించి ఉన్నత స్థానంలో నిలవాలని ప్రొద్దుటూరు డిప్యూటీ డిఇఒ కృష్ణప్ప విద్యార్థులకు సూచించారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. పాఠశాల రికార్డులను, పరిసరాలను పరిశీలించారు. అనంతరం ఉపాధ్యాయుల పని తీరును విద్యార్థుల నైపుణ్యం గురించి ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులును అడిగి తెలుసుకున్నారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడి శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. కష్టపడి కాకుండా ఇష్టపడి చదువుకోవాలని బోధించారు. పది పరీక్షల్లో అత్యంత ప్రతిభ కనబరిచి మంచి ఫలితాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఎంఇఒలు నాగేశ్వర నాయక్, సుబ్బారావు, సిబ్బంది పాల్గొన్నారు.

రీసర్వే సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

ప్రజాశక్తి - చాపాడు

రీ సర్వే చేపట్టిన భూ సమస్యలను పరిష్కరించేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు రీసర్వే డిప్యూటీ తహశీల్దార్ నారాయణస్వామి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని చాపాడు సచివాలయంలో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రీ సర్వే చేపట్టిన భూముల్లో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తేవాలన్నారు. రైతుల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో సర్వేయర్, వీఆర్ఒ, పంచాయతీ కార్యదర్శి, గ్రామ నాయకులు హర్షవర్ధన్‌రెడ్డి, జమాల్, రైతులు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖలో సిబ్బంది కొరత

- ఇక్కట్లుపడుతున్న రైతులు, ప్రజలు

ప్రజాశక్తి - వేముల

వేముల విద్యుత్ శాఖలో సరిపడా సిబ్బంది లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్ శాఖలో కీలకమైన అసిస్టెంట్ ఇంజనీర్, సబ్ ఇంజనీర్ లేకపోవడంతో విద్యుత్ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలో తెలియక ప్రజలు, రైతులు ఇక్కట్లు పడుతున్నారు. వ్యవసాయ పొలాలకు ట్రాన్స్‌ఫార్మర్ల కోసం దరఖాస్తు చేసుకోవాలంటే రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఎవరికి దరఖాస్తు ఇవ్వాలో తెలియక సతమతమవుతున్నారు. సిబ్బందిని అడిగితే తమకు తెలియదని తెలుపుతున్నారని రైతులు వాపోతున్నారు. మండలంలో చాలా గ్రామాలకు అధికారుల కొరత ఉండడంతో ప్రజలు, రైతులు అసౌకర్యానికి గురవుతున్నారు. విద్యుత్ శాఖ కార్యాలయం వద్దకు ఏదైనా సమస్య నిమిత్తం సంబంధిత అధికారులను కలవాలంటే ఎవరిని కలవాలో తెలియదంటున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు స్పందించి మండలంలో విద్యుత్ శాఖ సిబ్బందిని పూర్తిస్థాయిలో నియమించాలని రైతులు, ప్రజలు కోరుతున్నారు.

కంది పంటలో సస్యరక్షణ చర్యలు

ప్రజాశక్తి - ముద్దనూరు

కంది పంటలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు వెంకట సుబ్బయ్య రైతులకు సూచించారు. శెట్టివారిపల్లె గ్రామంలో బుధవారం ఆయన ఎడిఎ ఆధ్వర్యంలో ఎఒ వెంకట కృష్ణారెడ్డి పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పురుగుమందుల వాడకం తగ్గించాలన్నారు. సహజ సిద్ధ, సేంద్రియ పద్ధతులను ఉపయోగించి పంటలు సాగు చేయాలన్నారు. కంది పంటను పురుగు నుంచి కాపాడుకునేందుకు ఎకరానికి 6 చొప్పున పక్షి స్థావరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రామసుధ, నాయకులు లక్ష్మీనారాయణ, ప్రజలు పాల్గొన్నారు.

చాపాడు : అధిక దిగుబడులకు రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించుకోవాలని పులివెందుల ప్రకృతి సేద్య పేర్కొన్నారు. మండలంలోని ఎర్రగుడి గ్రామపంచాయతీ పరిధిలోని బిఎస్ తండాలో బుధవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఎఒ నవంత్ బాబు ఆధ్వర్యంలో రైతుల సమావేశం, పంట పొలాల సందర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక వ్యవసాయ పద్ధతులను పాటిస్తూ అధిక దిగుబడులను సాధించేందుకు అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలన్నారు. రానున్న కాలంలో తక్కువ పెట్టుబడితో అధిక నాణ్యమైన దిగుబడులు సాధించడానికి ప్రకృతి వ్యవసాయమే శరణ్యమన్నారు. ఆరోగ్యకరమైన ఉత్పత్తులు పండించడానికి ఆకులు, అలములు ద్వారా కషాయాలు తయారు చేసుకుని పంటలలో చీడపురుగుల నివారణకు సలహాలిచ్చారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి రమణారెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, స్థానిక రైతులు, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ ప్రసాద్ పాల్గొన్నారు.

విద్వాన్ భాస్కర్‌రాజు మృతి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు



స్థానిక రామేశ్వరానికి చెందిన ప్రముఖ సాహితీవేత్త విద్వాన్ భాస్కర్‌రాజు (78) బుధవారం మృతి చెందారు. ఆయన శ్వాసకోశ సంబంధిత వ్యాధితో కడప ప్రయివేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. భాస్కర్‌రాజు తెలుగు పండితుడిగా 35 ఏళ్ల వివిధ ప్రాంతాల్లో పనిచేసి 2010లో ఉద్యోగ విరమణ చేశారు. ప్రముఖ వ్యక్తిగా పలు సాహితీ కార్యక్రమాల్లో పాల్గొని ప్రముఖుల ప్రశంసలు పొందారు. తబల వాయించడంలో అభిరుచి కలిగి ప్రముఖుల హరికథకు సహకరించారు. ఆయన రామలింగ శతకం, కవితా విలాపం తదితర కవితా సంకలనాలను వెలువరించారు. భాస్కర్‌రాజుకు భార్య, ఒక కుమార్తె, ఇద్దరు కుమారులున్నారు. అంత్యక్రియలు గురువారం జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు. భాస్కర్‌రాజు మృతి పట్ల కడప జిల్లా రచయిత సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం ప్రగాఢ సంతాపం తెలిపారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ మహిళ మృతి

ప్రజాశక్తి - చక్రాయపేట

మండలంలోని కుమార్ కాల్వ గ్రామం దళితవాడకు చెందిన నల్లవెంకటగారి కమలమ్మ(62) రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందింది. వివరాల్లోకి వెళితే.. కమలమ్మ మంగళవారం సాయంత్రం వేంపల్లికి వెళ్లేందుకు రోడ్డుపైకి వచ్చి ఉండగా, వేంపల్లె వెళుతున్న టివిఎస్ ఎక్సెల్‌లో కమలమ్మ కూర్చుంది. కుమారకాల్వకు చెందిన దర్బార్ ఆర్టీ గ్రామ సమీపంలోని గవిని చెరువు వద్ద టివిఎస్ ఎక్సెల్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో కమలమ్మకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం వేంపల్లె తరలించగా, అక్కడి వైద్యులు తిరుపతి రుయాకు రెఫర్ చేశారు. రుయాలో ఆమె చికిత్స పొందుతూ మృతి చెందింది. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కృష్ణయ్య తెలిపారు.

శివకొండారెడ్డిపై దాడి కేసులో నలుగురు అరెస్టు

- రియల్ ఎస్టేట్‌లో వచ్చిన మనస్పర్థలే కారణం : సిఐ

ప్రజాశక్తి - కడప అర్బన్

టిడిపి నగర అధ్యక్షులు సోమిరెడ్డి శివకొండారెడ్డిపై ఈనెల 19న జరిగిన దాడి కేసులో నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు సిఐ తేజోమూర్తి తెలిపారు. అరెస్టయిన వారిలో బాలిశెట్టి రవితేజ, బి.దీపక్, షేక్ మహమ్మద్ ఇంతియాజ్, షేక్ సమీర్ ఉన్నారన్నారు. వీరితోపాటు ఒక మైనర్ ఉన్నాడని తెలిపారు. రియల్ ఎస్టేట్‌లో వచ్చిన మనస్పర్థలే దాడికి కారణమని సిఐ తెలిపారు. వీరిని కడప ఔటర్ రింగ్ రోడ్‌లో బుధవారం మధ్యాహ్నం చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ ఎస్ఐ రవికుమార్ అరెస్టు చేశారని తెలిపారు. కేసులో ప్రధాన నిందితుడైన బాలిశెట్టి రవితేజ, ఫిర్యాది సోమిరెడ్డి శివకొండారెడ్డి తెలుగుదేశం పార్టీకి చెందిన వ్యక్తులేనని తెలిపారు. నిందితులను రిమాండ్ కోర్టు ముందు హాజరుపరిచామన్నారు.

మురుగు నీటి సమస్య తీరేనా..!

ప్రజాశక్తి - మైదుకూరు(చాపాడు)

మైదుకూరు మున్సిపాలిటీ ప్రజలను మురుగునీటి, సిసి రోడ్ల సమస్యలు వేధిస్తున్నాయి. మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుండి మురుగునీటి సమస్య ఎక్కువగా ఉంది. దీన్ని పరిష్కరించడంలో అధికారులు పూర్తిగా విఫలమవుతున్నారు. వర్షాకాలంలో నంద్యాల రోడ్డు, కడప రోడ్డులోని ఆర్టీసీ బస్టాండ్ వరకు నీరు పూర్తిగా రోడ్లపైనే ప్రవహిస్తూ ఉంటుంది. ప్రజలకు ఇబ్బందికరంగా ఉంది. వనిపెంట రోడ్డులో విజయ్ సినిమా థియేటర్–అంకాలమ్మ దేవాలయం మధ్య వర్షం నీరు నిలిచి చెరువును తలపిస్తున్నది. ప్రయాణికులు చాలా అవస్థలు పడుతున్నారు. మైదుకూరు చెరువుకు సంబంధించిన కాలువ పూర్తిగా ఆక్రమణకు గురైంది. దీంతో ఓ మోస్తరు వర్షం పడినప్పటికీ నీరు రోడ్డుపై చేరుతుంది. మున్సిపాలిటీలోని 24 వార్డులలో సిమెంటు రోడ్లు వేయడంలో నిర్లక్ష్యం కనిపిస్తోంది. పట్టణంలో బద్వేల్ రోడ్డు, కడప రోడ్డు వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. ఇంటి నిర్మాణాలు అధికంగా జరుగుతున్నాయి. అయినప్పటికీ ఆయా కాలనీలను అభివృద్ధి చేయడంలో మాత్రం పాలకులు, అధికారులు వెనుకంజలో ఉన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని వెంకటాపురం, గొల్లపల్లె, శాంతినగర్, జోసఫ్‌పేట బద్వేల్ రోడ్డులోని మహబూబ్ నగర్, ప్రొద్దుటూరు రోడ్డులోని మూలబాట వీధి, సంత రోడ్డు, మార్కెట్ నుండి సాయిబాబా గుడి తదితర కాలనీలు మురుగు సమస్యతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. కడప రోడ్డులోని సర్వాయిపల్లె రోడ్డులో మురుగు నీరు అధికంగా చేరి దుర్వాసన వెదజల్లుతుంది. మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుండి ప్రత్యేక నిధులు ప్రభుత్వం కేటాయిస్తున్నా.. వాటిని సద్వినియోగం చేయడంలో అధికారులు విఫలమవుతున్నారు. కడప రోడ్డులో సర్వాయపల్లెకు వెళ్లే మార్గంలో నేషనల్ హైవే సమీపంలో వర్షపు నీరు అధికంగా లోతట్టు ప్రాంతాల్లో నిలుస్తోంది. వర్షం పడినప్పుడు నీరు అధికంగా రోడ్లపై పారుతూ ఉంటుంది. ఈ ప్రాంతంలో దోమల అధికంగా వృద్ధి చెందుతూ ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. మురుగు కాలువల వ్యవస్థను మెరుగుపరిచి నీరు తొలగిపోయేలా ఏర్పాటు చేయాలి. తద్వారా వ్యర్థ నీరు నిల్వ చేరదు. ప్రజలు ఆరోగ్యంగా ఉంటారని పలువురు పేర్కొంటున్నారు.

మైదుకూరులో జలమయమైన లోతట్టు ప్రాంతం

భూ సమస్యలు పరిష్కరించాలి : ఆర్‌డిఒ

రికార్డులను పరిశీలిస్తున్న ఆర్‌డిఒ సాయిశ్రీ

ప్రజాశక్తి - ముద్దనూరు

భూ సమస్యలు పెండింగ్‌లో లేకుండా చూడాలని జమ్మలమడుగు ఆర్‌డిఒ సాయిశ్రీ సూచించారు. ప్రజలను, రైతులను కార్యాలయం చుట్టూ తిప్పకుండా సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయాన్ని బుధవారం ఆమె తనిఖీ చేసి పలు రికార్డులను పరిశీలించారు. చుక్కల, ఇనాం, వెబ్ ల్యాండ్, రీ సర్వే భూములు, పెండింగులో ఉన్న సమస్యలు గురించి తహశీల్దార్ వరదకిషోర్ రెడ్డిని అడిగి తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు, రైతుల నుంచి వచ్చే వినతులు, ఫిర్యాదులు, అర్జీలు పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని సూచించారు. మ్యుటేషన్, పాస్ పుస్తకం నిర్దేశించిన గడువులోగా అందేలా చూడాలన్నారు. మీ సేవ ద్వారా వచ్చే వివిధ సర్టిఫికెట్లు జాగ్రత్తగా పరిశీలించి మంజూరు చేయాలన్నారు. రెవెన్యూ శాఖ అందించే సేవలకు కావలసిన పత్రాల పట్టిక బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. మరణించిన వారికి సంబంధించి భూ సమస్యలు ఉండి.. సరైన ఆధారాలు లేకుంటే తిరస్కరించాలని సూచించారు. అనంతరం రికార్డుల గదిని పరిశీలించారు. ప్రతి ఒక్క రికార్డును భద్ర పరచి సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్ఐ సుజిత్, మండల సర్వేయర్ హర్షవర్ధన్ రాజు, ఎఎస్ఒ నవతేజ, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా జాతీయ సదస్సు ప్రారంభం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పశు వైద్య రంగాల్లో వినూత్న పరిశోధనలు చేసిన విదేశీ శాస్త్రవేత్తలను ఎస్‌విఎస్‌బిటి, ఎస్‌వివియు సంయుక్తంగా సన్మానించారు. రూరల్ పరిధిలోని పశువైద్య కళాశాలలో బుధవారం జాతీయ సదస్సును వైభవంగా ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా ఎస్‌విఎస్‌బిటి ప్రెసిడెంట్ డాక్టర్ ఏజే ధామి, సెక్రెటరీ డాక్టర్ కేకే హాదియా, ఎస్‌వివియు వైస్ చాన్సలర్ డాక్టర్ జెవి రమణ, డీన్ డాక్టర్ కే వీరబ్రహ్మయ్య విచ్చేశారు. ఆర్గనైజర్ సెక్రెటరీ డాక్టర్ రాజ కిషోర్ ఆధ్వర్యంలో ముఖ్య అతిథులు జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్ జాతీయ సదస్సు ప్రాముఖ్యతను వివరించారు. ఆధునిక శాస్త్ర సంకేతిక పరిజ్ఞానం పశువైద్య రంగానికి సంబంధించిందన్నారు. వివిధ పరిశోధన సూత్రాలను మన శాస్త్రవేత్తలు కనుగొనడం అద్భుతమని పేర్కొన్నారు. జాతీయ సదస్సు నిర్వహణ అద్భుతంగా ఉందని ముఖ్యఅతిథులు ప్రశంసించారు. జాతీయ సదస్సులో పాల్గొన్న దేశవిదేశీ శాస్త్రవేత్తలకు మెమెంటోలు బహుకరించారు. కార్యక్ర మంలో డాక్టర్ ఇందిర, డాక్టర్ మానస, డాక్టర్ అనూష, డాక్టర్ మంజుల, డాక్టర్ నాగమల్లిక పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్య అతిథులు, ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్

పరిసరాల శుభ్రత.. ఆరోగ్యానికి భద్రత

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్) :

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం, దోమల వల్ల వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఇఒపిఆర్‌డి రామాంజనేయ రెడ్డి, ప్రొద్దుటూరు మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఆరోగ్య సిబ్బందితో వారు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలంలో పంచాయతీ కార్యదర్శులు వృథా నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. నీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో ఆయిల్ బాల్స్ వేయడం, వేస్ట్ ఆయిల్ చల్లడం వంటి లార్వా దోమల నివారణ చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. ఆరోగ్య సిబ్బంది సమన్వయంతో పనిచేసి జ్వరాలు రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ వరప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు రామమోహన్ రెడ్డి, రామకృష్ణ, సచివాలయాల పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ముద్దనూరు : వ్యక్తిగత, పరిసరాల శుభ్రత ఆరోగ్యానికి భద్రతనిస్తుందని ఎంపిడిఒ ముకుందారెడ్డి తెలిపారు. ఎస్వీ గిరి కాలనీలో బుధవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి కరిష్మా ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ల్యాబ్ టెక్నీషియన్ జాసన్ రక్త పరీక్షలు చేశారు. వైద్య శిబిరాన్ని ఎంపిడిఒ పరిశీలించారు. అనంతరం కాలనీలో పర్యటించి ప్రజలకు శుభ్రతపై అవగాహన కల్పించారు. రోడ్లపై మురుగు నీరు, చెత్త, వ్యర్థాలను వేయకూడదన్నారు. శుభ్రత లోపిస్తే దోమలు విజృంభిస్తాయన్నారు. దోమకాటు వల్ల విష జ్వరాలు, వ్యాధులు బారిన పడతారన్నారు. ఎల్ఎమ్ కాంపౌండ్, ఎస్వీ గిరి కాలనీల్లో అపరిశుభ్రంగా ఉన్న ప్రదేశాల్లో బ్లీచింగ్ పిచికారీ చేశారు. జూనియర్ అసిస్టెంట్లు విజయ్‌కుమార్, భాస్కర్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - వేంపల్లె

స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో శ్రీచైతన్య పాఠశాలకు చెందిన ధర్మ ప్రభాకర్‌రెడ్డి అనే విద్యార్థి జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి తెలిపారు. ఆ విద్యార్థిని బుధవారం కరస్పాండెంట్ చక్రపాణిరెడ్డి అభినందించారు. సికె దిన్నె, ఎస్‌వి ఉన్నత పాఠశాల బయనపల్లి ఆధ్వర్యంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఖోఖో పోటీలు నిర్వహించారన్నారు. క్రీడాల్లో విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ఫిజికల్ డైరెక్టర్ కృష్ణప్రసాద్‌ను చక్రపాణిరెడ్డి అభినందించారు. చదువుతో పాటు క్రీడల్లో విద్యార్థులు రాణించాలని ఆయన ఆకాంక్షించారు.

ప్రతిభ చూపిన విద్యార్థినికి అభినందనలు

ప్రజాశక్తి - చాపాడు

విద్యార్థిని అభినందిస్తున్న జయచంద్రారెడ్డి

కడప డిఎస్ఎ స్టేడియంలో నిర్వహించిన అండర్–14 స్థాయి పోటీలలో స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు ఆ పాఠశాల చైర్మన్ డాక్టర్ వి.జయచంద్రారెడ్డి తెలిపారు. బాస్కెట్ బాల్ విభాగంలో శర్వాణి, జేష్ణసాయి, చెస్‌లో పి.అభిరామన్, క్రికెట్‌లో కె.ఉమర్ సిద్ధిక్, బి.సేతన్‌రెడ్డి, నిశిల్ సంగ్వాన్, స్కేటింగ్‌లో వి.జయవర్ధన్ శాస్త్రి(అండర్–11) రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు వివరించారు. పాఠశాలలో వివిధ రకాల క్రీడలకు అత్యంత ప్రాధాన్యతనిస్తారని, పిల్లలను వారు ఎంచుకున్న క్రీడలో నిష్ణాతులుగా తయారు చేసేందుకు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు ఎల్లవేళలా కృషి చేస్తారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పాఠశాల డైరెక్టర్ లోహిత్, ప్రిన్సిపల్ రవీంద్ర, ఉపాధ్యాయులు అభినందించారు.

అంతర విశ్వవిద్యాలయ పోటీలకు ట్రిపుల్‌ఐటి విద్యార్థులు

ప్రజాశక్తి - వేంపల్లె

అంతర విశ్వవిద్యాలయ క్రీడా పోటీలకు ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి విద్యార్థులు ఎంపికైనట్లు డైరెక్టర్ కుమార స్వామి గుప్తా పేర్కొన్నారు. అంతర విశ్వవిద్యాలయ క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులను బుధవారం ఆర్జీయూకేటీ వైస్ ఛాన్సలర్ విజయ్‌కుమార్, డైరెక్టర్ కుమార స్వామి గుప్తా అభినందించారు. ఈ నెల 20న నూజివీడు ట్రిపుల్‌ఐటి క్యాంపస్‌లో అంతర కళాశాలల క్రీడా పోటీలు నిర్వహించినట్లు డైరెక్టర్ తెలిపారు. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటి విద్యార్థులు ప్రతిభ చూపడంతో ఆల్ ఇండియా సౌత్ జోన్ క్రీడా పోటీలకు హాజరవుతున్నట్లు పేర్కొన్నారు. ఆల్ ఇండియా సౌత్ జోన్ క్రీడా పోటీల్లో బాస్కెట్‌బాల్‌కు నలుగురు, షటిల్‌కు ముగ్గురు, కబడ్డీకి ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. అనంతరం విద్యార్థులను పరిపాలన అధికారి డాక్టర్ పెనుగొండ రవికుమార్, ఫిజికల్ డైరెక్టర్లు పివి రెడ్డి, షంషాద్ బేగం, బాల ఓబయ్య అభినందించారు.

పిచ్చిమొక్కలు తొలగింపు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రొద్దుటూరు అనిబిసెంట్ మున్సిపల్ ఉన్నతపాఠశాల క్రీడామైదానాన్ని మున్సిపల్ అధికారులు బుధవారం శుభ్రం చేయించారు. చిన్నపాటి వర్షానికి ఈ ప్రాంతం బురదమయంగా తయారయ్యేది. వాకర్లు తీవ్ర అసౌకర్యానికి గురయ్యేవారు. మైదానం చుట్టూ పిచ్చిమొక్కలను పారిశుధ్య కార్మికులు తొలగించారు. గుంతలను పూడ్చారు. జిమ్‌పాయింట్‌లోని కొన్ని పరికరాలు విరిగిపోయి ఉన్నాయని శరీర దారుఢ్యానికి ఇవి ఉపయోగం లేకుండా ఉన్నాయని, వీటి స్థానంలో కొత్తవి అమర్చాలని పట్టణంలోని సీనియర్ సిటిజన్లు కోరారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

ప్రజాశక్తి - వేముల

మండల కేంద్రంలోని గొందిపల్లి గ్రామ పంచాయతీలో నూతనంగా నిర్మించే శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో గొందిపల్లి సర్పంచ్ దేవన రామాంజనమ్మ, దేవన రామాంజనేయులు, కబో జి రామకృష్ణ, గడ్డం సదాశివుడు, గడ్డం మునలయ్య, ఎర్రగుండు రమణ, వేముల ఓబులేసు, బీసీ సెక్రెటరీ గంగాధర్ యాదవ్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

భూమిపూజలో పాల్గొన్న గ్రామప్రజలు

రక్త పరీక్షలు చేయించుకోవాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

గర్భిణులు రక్త పరీక్షలు చేయించుకోవాలని జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారి రమేష్‌రెడ్డి సూచించారు. ఉప్పలూరు గ్రామ సచివాలయాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ గర్భిణులు, కిషోర్ బాలికలు, బాలింతలు ఆరోగ్యం పట్ల తగిన జాగ్రత్త తీసుకోవాలన్నారు. అనంతరం పిహెచ్‌సిలో వైద్య సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించాలని ఆయన సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీకాంత్, ఎఎస్ఒ జాకబ్, డిఎస్ఒ రాజశేఖర్, ఆరోగ్యవిస్తరణ అధికారి శ్రీనివాసరెడ్డి, సూపర్‌వైజర్ శోభా కుమారి, ఫార్మాసిస్ట్ జగదీశ్, ల్యాబ్ టెక్నీషియన్ జాసన్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎద్దు రాహుల్

సమయపాలన పాటించని విద్యా సంస్థలు

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

పట్టణంలోని ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు ఎక్స్‌ట్రా క్లాసులో పేరుతో సమయపాలన పాటించడం లేదని, అలాంటి విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఎద్దు రాహుల్ డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని కార్పొరేట్, ప్రయివేట్ విద్యా సంస్థలు ప్రభుత్వ విద్య విధానాలను పాటించకుండా విద్యార్థులను మానసికంగా బాధపెడుతున్నారని తెలిపారు. ప్రభుత్వ విధానాల ప్రకారం సమయపాలన పాటించడం లేదన్నారు. ఎక్స్‌ట్రా క్లాసులు, ఎగ్జామ్స్ వంటి పేర్లతో విద్యార్థులపై మానసిక ఒత్తిడి తెస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి విద్యా సంస్థలపై విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు.

బ్రాడ్‌గేజ్ రైలు మార్గానికి మంగళమేనా? : పిసిసి

ప్రజాశక్తి - వేంపల్లె

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి చూస్తుంటే కడప–రాయచోటి–మదనపల్లి–బెంగళూరు నూతన బ్రాడ్‌గేజ్ రైలు మార్గం నిర్మాణానికి మంగళం పలికినట్లుందని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాయలసీమ సమగ్రాభివృద్ధి కోసం 2008–09 రైల్వే బడ్జెట్‌లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చెరి సగం ఖర్చు భరించే షరతుతో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును మంజూరు చేసిందన్నారు. రైల్వే ప్రాజెక్టు పొడవు 255.40 కిలోమీటర్లు అన్నారు. ఇందులో 205 కిలోమీటర్లు ఆంధ్రప్రదేశ్‌లో, 50.40 కిలోమీటర్లు కర్ణాటకలో అన్నారు. 2008–09 నాటి అంచనా వ్యయం రూ.3038 కోట్లు అన్నారు. 2010 సెప్టెంబర్‌లో నాటి రైల్వే మంత్రి మునియప్ప శంకుస్థాపన చేశారని తెలిపారు. జగన్ ముఖ్యమంత్రి కావడంతో రైల్వే ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన నిధులు విడుదల చేయలేదని విమర్శించారు. చంద్రబాబు నేతృత్వంలో కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 4 నెలల 10 రోజులైనా రైల్వే పనులు పునఃప్రారంభం కాలేదని విమర్శించారు. ఇప్పటికైనా ఈ ప్రాంత ప్రజాప్రతినిధులు నిద్ర లేచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మీద ఒత్తిడి తెచ్చి పనులు పునఃప్రారంభమయ్యేలా చూడాలని, లేకపోతే రాయలసీమ ద్రోహులుగా చరిత్రలో నిలిచిపోతారని తులసిరెడ్డి పేర్కొన్నారు.

కాంగ్రెస్ హయాంలో పేద విద్యార్థుల్లో వెలుగులు

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

వైఎస్ఆర్ మానస పుత్రిక ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకమని, కాంగ్రెస్ హయాంలో ఎంతో మంది పేద విద్యార్థుల జీవితాల్లో వెలుగు వచ్చిందని ఆ పార్టీ పులివెందుల నియోజకవర్గ ఇన్‌ఛార్జి మూలంరెడ్డి ధ్రువకుమార్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మహానేత వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా కాంగ్రెస్ ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని అమలు చేసిందన్నారు. నాడు వైఎస్ తనయుడు మాజీ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి తన హయాంలో ఆ పథకాన్ని నీరుగార్చారని విమర్శించారు. విద్యార్థులకు చెల్లించాల్సిన ఫీజులు రూ.3500 కోట్లు పెండింగ్ పెట్టడం సిగ్గుచేటన్నారు. వైసిపి ప్రభుత్వం చేసింది మహా పాపమైతే.. కూటమి సర్కారు విద్యార్థులకు శాపం పెడుతోందని విమర్శించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం అమలు చేయాలని చంద్రబాబును డిమాండ్ చేస్తున్నామన్నారు.

పల్లెపండుగ కార్యక్రమంలో భూపేష్‌రెడ్డి, నాయకులు

గ్రామాల అభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

ప్రజాశక్తి - కొండాపురం

గ్రామాల అభి వృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని జమ్మలమడుగు టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి సూచించారు. పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలో చామలూరు గ్రామంలో భూపేష్‌రెడ్డి, టిడిపి మండల ఇన్‌ఛార్జి శివ నాథరెడ్డి సిమెంట్ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా భూపేష్‌రెడ్డి మాట్లాడుతూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉంటేనే గ్రామాల అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ నాగప్రసాద్, చామలూరు ప్రెసిడెంట్ రాఘవరెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి, శివనాథరెడ్డి, లక్ష్మిరెడ్డి, మండల కన్వీనర్ నాగేశ్వర్ రెడ్డి, గండ్లూరు శంకర్ రెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి గోరిశెట్టి బాబు, బుజ్జి, రామలింగేశ్వరరెడ్డి, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'వేంపల్లెలో పర్యటిస్తే జగన్ పాలన తెలుస్తుంది'

ప్రజాశక్తి - వేంపల్లె

మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సొంత నియోజకవర్గపరిధిలోని వేంపల్లెలో కూడా రోడ్డు మార్గంలో ప్రయాణిస్తే తన అయిదేళ్ల పాలన ఏంటో ఆయనకు అర్థమవుతుందని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జగన్ వేంపల్లె ప్రజల ఓట్లు దండుకోవడం తప్ప, ఒక్క నాడు కూడా వేంపల్లెలో పర్యటించేందుకు వీలు ఉండదన్నారు. ప్రజల అభివృద్ధి జగన్‌కు పట్టదన్నారు. వేంపల్లెలో రోడ్ల పరిస్థితి అధ్వానంగా ఉందన్నారు. రూ.14 కోట్లతో నిర్మించిన జిల్లా పరిషత్ బాలుర, బాలికల హైస్కూల్ భవనాల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. కడప రోడ్డులో రూ.2 కోట్లతో నిర్మించిన పార్కు పరిస్థితి కూడా అధ్వానంగా ఉందన్నారు. ప్రధాన రోడ్లతో పాటు ప్రతి వీధిలో అండర్ డ్రయినేజీ పేరుతో రోడ్లను మొత్తం నాశనం చేశారన్నారు. జగన్ పరిపాలనలో వేంపల్లెలో అభివృద్ధి జరగలేదని విమర్శించారు. జగన్‌రెడ్డి వేంపల్లెలో పర్యటిస్తే వైసిపి నాయకులు చేసిన ఘనత తెలుస్తుందని అన్నారు.

IN THE COURT OF THE CHAIRMAN DISTRICT PERMANENT LOKADALATH UTILITY SERVICES :: KADAPA

P.L.A.C.No. 38/2023

Gandholla Bhagya Lakshmi

...Petitioner/Petitioner

Vs

3) N.Jyothi, Allaged wife of G.Naga Sivan, S.G. Teacher, aged 42 years, Hindu, District Educational Officer, D.E.O. Office, Kadapa.

...Respondent No.3/Proposed Party No.3

NOTICE

మీ పైన రాజశ్రీ పై కోర్టులో నిన్ను పార్టీగా చేసి పై దావాలో న్యాయము చేయమని మరియు ఈ దావాలో వాది యొక్క కుమారుడు జి.నాగశివణకు రావలసిన డబ్బు లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ ఎస్‌బిఐ ఆర్టీసీ బస్టాండు, కడప తీసుకొనుటకు మీకు ఏమైనా ఆక్షేపణ వున్న ఎడల పై కోర్టులో 28.10.2024 తేదీన 10.30 గంటలకు హాజరై తెల్పుకోవలెను. లేనంతట పరోక్షముగా తీర్మానించబడును.

//By Court Order//

S.MASTHAN VALLI,
M.Com., L.L.B.,
Advocate & Notary,
KADAPA.

IN THE COURT OF THE HON'BLE III Addl. JUNIOR CIVIL JUDGE, KADAPA

E.P.No. 269/2023

O.S.No. 567/2021

Chennampalli Rama Krishna Reddy.

...Decree Holder

Vs

Bachu Chandra Reddy and others.

...Judgment Debtors

Notice to:-

3. G.Sumathi, W/o Late G.Chakravarthi, R/at D.No.86/242-2, Sivanandapuram Colony, Puttlampalli Village, Kadapa City.

4. Gajjala Tulasamma, W/o Gajjala Rami Reddy, R/at D.No.5/81, Palur village, Peddamudiam Mandal, Kadapa District.

...Respondents/Defendants

నోటీసు

పై E.P. లో Decree Holder, J.Dr. అయిన మీపై E.P. Schedule Propertyలో అక్రమ కట్టడాలు తొలగిస్తు ఖాళీ జాగాను స్వాధీనపరుచుకొనుటకు పైన కనబరచిన కోర్టులో E.P.ని దాఖలు చేసి ఉన్నారు. సదరు E.P. మీ హాజరుగాను 8/11/2024 తేదీన వాయిదా వేసి వున్నారు. కావున సదరు తేదీన మీరు స్వయంగా కానీ, వకీలు ద్వారా కానీ హాజరు అయి మీ యొక్క ఆక్షేపణలు తెలుపుకొ నవలెను. లేనిచో మీకు పరోక్షముగా తీర్మానించబడును.

SCHEDULE

Vacant site situated Kadapa District, Kadapa Corporation in Kadapa Registration and Kadapa Sub-Registration District, Kadapa Mandal in Putlampalli Village.
Sy.No.49/2 to an extent of Ac.0.03 cents Plot No. 1-A bounded as follows:
East: Rastha, West: Site belongs to Sivanandapuram Society, North: Road, South: Site belongs to K.Siva Narayana Reddy
Within the above said boundaries with all easementary rights.

//కోర్టు వారి ఉత్తర్వుల మేరకు//

జి.జ్ఞానప్రసాద్
అడ్వకేట్, కడప.